సాక్షి
వికారాబాద్
గురువారం । 5 । అక్టోబర్ । 2023



**బీసీ కుల గణన చేపట్టండి**

కేంద్రం బీసీ కులగణన చేపట్టకపోవడం శోచనీయమని బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. 8లో▸



**నీటి సమస్యపై నిరసన**

బంట్వారం మండలం నల్బత్తాపూర్ ఎస్సీ కాలనీలో నీటి సమస్యపై మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. 8లో▸



**సబ్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా..?**

దౌల్తాబాద్ మండలం గోకఫసల్‌వాద్‌కు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనా పనులు ప్రారంభం కావడం లేదు. 9లో▸

## న్యూస్‌రీల్

### కాంగ్రెస్ గూటికి 'బిగ్ షాట్'

- బీఆర్ఎస్‌ను వీడనున్న డీసీసీబీ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి
- నేడు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో భేటీ
- తాండూరు టికెట్‌పై హామీ



**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన 'బిగ్ షాట్' కాంగ్రెస్‌లో చేరనున్నారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న డీసీసీబీ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి హస్తం కండువా వేసుకోవాలని డిసైడయ్యారు. తాండూరు అసెంబ్లీ టికెట్ ఇస్తామన్న హామీతోనే కాంగ్రెస్ గూటికి చేరాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా గురువారం వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో భేటీ అవుతారని మనోహర్‌రెడ్డి సన్నిహితులు వెల్లడించారు. బ్రేక్ ఫాస్ట్ భేటీలో భాగంగా కాంగ్రెస్ నేతలు మనోహర్‌రెడ్డి నివాసానికి రానున్నారని తెలిపారు. మనోహర్‌రెడ్డి గతంలో రెండు సార్లు కుల్కచర్ల జెడ్పీటీసీగా పనిచేశారు. ఈయన చేరిక పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో ప్రభావం చూపనుంది.

### హరీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

**కుల్కచర్ల:** మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని కుల్కచర్ల ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొత్తబలిజ రాజు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ప్రతిభకు పురస్కారం



నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

**కుల్కచర్ల:** ఓటు హక్కు నమోదుపై కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలు అందరి మన్ననలు పొందాయి. బుధవారం అడిషనల్ కలెక్టర్ అమిత్ విద్యార్థులను అభినందించారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఓటు హక్కు వినియోగం, నమోదుపై విద్యార్థులు రూపొందించిన వీడియోలను జిల్లా అధికారులకు అందజేశారు. ఈ క్రమంలో జిల్లాలో ఉత్తమమైన వీడియోలకు అధికారులు ప్రశంసాపత్రాలతో పాటు నగదు పురస్కారాలను అందజేశారు. కుల్కచర్ల బాలికల పాఠశాలకు చెందిన శోభ (పదో తరగతి)కు ఉత్తమ ప్రతిభ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ కోటాజీ, కొత్తపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్, ఉపాధ్యాయులు విజయ శ్రావణ్ కుమార్, రషీద్, విద్యార్థులు చరణ్, చందు, సంధ్య, శృతి, భరత్, మహేశ్, ప్రవీణ్, సాయి, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికలకు సహకరించండి

అఖిలపక్ష నాయకులతో ఆర్డీఓ



మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

**ఇబ్రహీంపట్నం:** అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పక్షాలు, ప్రజలు సహకరించాలని ఆర్డీఓ అనంతరెడ్డి కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా జరిగేలా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ తుది ఓటరు జాబితాను విడుదల చేసి రాజకీయ పక్షాల నేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి యశ్వంత్, వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొన్నారు.

# రూ.173 కోట్లతో అభివృద్ధి పనులు

- నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- హాజరుకానున్న మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి
- బ్లాక్ గ్రౌండ్‌లో బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఆనంద్, అధికారులు



కేటీఆర్ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్, ప్రజాప్రతినిధులు, అధికారులు

**వికారాబాద్:** జిల్లా కేంద్రంలో గురువారం పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఎమ్మెల్యే ఆనంద్.. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో రూ. 173 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్.. జిల్లా మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డితో కలిసి భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ముందుగా కేటీఆర్ హెలిక్యాప్టర్ ద్వారా వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయ మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బ్లాక్ గ్రౌండ్‌కు వస్తారు. అక్కడ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం ఎమ్మెల్యే ఆనంద్ ఇంటికి చేరుకుంటారు. ఆ తరువాత బహిరంగ సభ నిర్వహించే బ్లాక్ గ్రౌండ్‌కు చేరుకొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఈ సభను స్థానిక ఎమ్మెల్యే ఆనంద్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని జనసమీకరణ చేస్తున్నారు.

**అభివృద్ధి పనులకు..**

మున్సిపల్ పరిధిలో రూ. 173 కోట్లతో చేపట్టబోయే పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు చేయనున్నారు. రూ. 96 కోట్లతో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. రూ. 30 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు, రూ. 25 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. రూ. 5 కోట్లతో పార్కుల సుందరీకరణ, రూ. 2 కోట్లతో మోడ్రన్ దోబీగాట్ల నిర్మాణ పనులకు భూమి పూజలు చేస్తారు. ఆలంపల్లి, రామయ్యగూడ గ్రామాల్లో రూ. 2 కోట్లతో చేపట్టనున్న గ్రేవీ యార్డుల నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారు. రూ. 7.20 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నారు. వికారాబాద్‌లో ప్రయాణికులు, అనాథలు రాత్రి బస చేసేందుకు రూ. 52 లక్షలతో నిర్మించిన భవనాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారు. అలాగే రూ. 1.20 కోట్లతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ యూనిట్, రూ. 1.52 కోట్లతో నిర్మించిన కేజీబీవీ అదనపు తరగతి గదులను ప్రారంభిస్తారు. రూ. 48.69 లక్షలతో నిర్మించిన సఖీ సెంటర్‌ను, రూ. 1.10 కోట్లతో నిర్మించిన గిరిజన భవనాన్ని, కోటి రూపాయలతో నిర్మించిన పోస్ట్ మెట్రిక్ కళాశాల భవనాలను మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారు.

**సభకు భారీ ఏర్పాట్లు**

త్వరలో ఎన్నికలు జరగనుండటంతో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సభకు కేటీఆర్‌తో పాటు ఇద్దరు మంత్రులు రానుండడంతో భారీగా జనం వచ్చేలా చూస్తున్నారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దారు. కొన్ని చోట్ల రోడ్లకు మరమ్మతులు చేయించారు. మంత్రి కేటీఆర్ సభకు నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే ఆనంద్ పిలుపునిచ్చారు. ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు ప్రారంభం కానుండడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.



ప్రగతి నివేదన సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# పని చేసే వారినే దీవించండి

- కృష్ణా జలాలతో మీ పాదాలు కడుగుతా
- మాయ మాటలు చెప్పే పార్టీలను నమ్మకండి
- అభివృద్ధి, సంక్షేమం మా ఎజెండా
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

**కొడంగల్:** పని చేసే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి దీవించాలని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని కోస్గిలో ప్రగతి నివేదన సభ నిర్వహించారు. మంత్రి హరీశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. నరేందర్ రెడ్డిని రెండో సారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏడాదిలోపు నియోజకవర్గానికి సాగునీరు తీసుకొస్తారని పేర్కొన్నారు. కృష్ణా జలాలతో కొడంగల్ ప్రజల కాళ్లు కడుగుతానని అన్నారు. నియోజకవర్గంలో లక్షా 50వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఈ నియోజకవర్గంలోని 46 తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గిరిజనలను అధికారంలో భాగస్వాములను చేసి ఆర్థికాభివృద్ధి వైపు నడిపిస్తున్నట్లు చెప్పారు. వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. మహిళల కోసం గృహలక్ష్మి, ఆరోగ్య లక్ష్మి, అమ్మఒడి, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 మహిళా రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాలలు, 600 జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్నదాతల కోసం రైతు బంధు, రైతు బీమా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, దళితుల కోసం దళిత బంధు, కుల వృత్తుల వారికి లక్ష ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ మా ఎజెండా అన్నారు. మాయ మాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ నాయకులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సమావేశంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బీ ప్రకాశ్, మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లలు దాటిన తెలంగాణ సంస్కృతి

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో బతుకమ్మ చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

**వికారాబాద్ అర్బన్:** బతుకమ్మ వేడుకలతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి తెలిశాయని,ఈ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే ఆనంద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజులతో కలిసి దసరా కానుకగా బతుకమ్మ చీరలు, క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2లక్షల 73 వేల మంది మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో క్రీడా ప్రాంగణాలు పూర్తి చేసుకున్న 574 జీపీలకు, మున్సిపల్ వార్డులకు రూ. 3 కోట్ల 13 లక్షలతో 626 క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ విజయకుమారి,డీఆర్‌డీఓ కృష్ణన్, డీవైఎస్ఓ హనుమంతరావు, డీఈవో రేణుకాదేవి, మెప్మా పీడీ రవికుమార్, ఎంపీడీవో సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధిలో ఆదర్శం..

**బషీరాబాద్:** అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం బషీరాబాద్ మండలం జీవన్గీ గ్రామంలో రూ. 6.20కోట్లతో మంతట్టి వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన, కాగ్నాలో రూ.8.74కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాంను స్థానిక ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదరికమన్నదే లేకుండా పోతోందన్నారు. పాలమూరు ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం కాబోతుందని పేర్కొన్నారు. కాగ్నా లో నీరు వృథా కాకుండా ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా ప్రమాణం చేస్తారని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి మహేందర్‌రెడ్డి సహకారంతో తాండూరు అభివృద్ధి పథంలో తీసుకెళుతానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తాండూరుకు భారీగా నిధులు వచ్చి అభివృద్ధి జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షే మం చూసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజుగౌడ్, ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి, వైస్ ఛైర్మన్ అజయ్‌ప్రసాద్, సర్పంచ్ నవనీతరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు పురుషోత్తం రావు, మాణి కొరెడ్డి, నర్సిరెడ్డి, మునీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు తుది జాబితా విడుదల

- జిల్లాలో 9,34,523 మంది ఓటర్లు
- పరిగి మినహా మూడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం

**వికారాబాద్ అర్బన్:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లా యంత్రాంగం అందుకు పూర్తి సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా బుధవారం ఓటరు తుది జాబితాను విడుదల చేసింది. జిల్లాలో 9,34,523 మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. బుధవారం ఓటరు జాబితా ప్రతులను కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో, పోలింగ్ బూతుల్లో అందుబాటులో ఉంచారు. అర్హత ఉండి ఓటరుగా నమోదు చేసుకోని వారి కోసం ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి పది రోజుల ముందు వరకు కొత్తగా ఓటు నమోదుకు అవకాశం కల్పించింది. అర్హులు విధిగా ఓటు హక్కు పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

**నియోజకవర్గాల వారీగా..**

జిల్లాలో 4,64,822 మంది పురుష ఓటర్లు, 4,69,659 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అంటే 4,837 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఒక్క పరిగి నియోజకవర్గం మినహా మిగతా మూడు చోట్ల మహిళా ఓటర్లే అధికం. వికారాబాద్ నియోజకవర్గంలో ఈ వ్యత్యాసం పెద్దగా లేదు. ఈ నియోజకవర్గంలో 1,11,065 మంది పురుష ఓటర్లు, 1,11,780 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అంటే 715 మంది మహిళా ఓటర్లు ఎక్కువ. పరిగి నియోజకవర్గంలో 1,27,835 మంది పురుష ఓటర్లు, 1,24,537 మంది మహిళలు ఉన్నారు. 3,298 మంది పురుష ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. తాండూరులో 1,11,242 మంది పురుష ఓటర్లు, 1,17,243 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 6,001 మంది మహిళా ఓటర్లు అధికం. కొడంగల్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇక్కడ 1,14,140 మంది పురుష ఓటర్లు, 1,16,099 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ కూడా 1959 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

# 'గ్యారంటీ కార్డు'తో వెలుగులు ఖాయం

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- పాంబండ ఆలయంలో ప్రత్యేక పూజలు



బొంరెడ్డిపల్లిలో ప్రజలకు కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

**కుల్కచర్ల:** కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాల గ్యారంటీ కార్డుతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు ఖాయమని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాంబండ రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బొంరెడ్డిపల్లి, బండవెల్కిచర్ల, ఎర్రగోవింద్ తండా, ఘనపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సంక్షేమ పథకాలు ఆ పార్టీ నాయకులకే అందుతున్నాయని అన్నా రు. బీఆర్ఎస్‌కు కుటుంబ ఆస్తులు పెంచుకోవడం తప్ప ప్రజల జీవితాలను బాగు చేయాలన్న ఆలోచన లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు.వృద్ధాప్య పింఛన్‌ను రూ. 4వేలకు పెంచడంతో పాటుగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం , రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, బ్లాక్ టు అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, జిల్లా కార్యదర్శి యాదయ్య, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు భాస్కర్, అంతారం సురేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

అనంతగిరి: వికారాబాద్ విచ్చేయుచున్న రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులతో కలిసి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

### అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



చిట్టిగిద్దలో మందుల షాపును తనిఖీ చేస్తున్న గోపాల్

నవాబుపేట: మందులు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలోని పలు పంటలను ఆయన పరిశీలిచారు. అనంతరం గ్రామంలోని ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని ఏఈఓలను ఆయన సూచించారు. ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలన్నారు. లేని పక్షంలో షాపుల యజమానులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే లైసెన్సులను కూడా రద్దు చేస్తామని గోపాల్ హెచ్చరించారు. ఆయన వెంట ఏఈఓ రమేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు షాద్‌నగర్‌కు మంత్రి కేటీఆర్ రాక

షాద్‌నగర్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ గురువారం షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. ఉదయం 10:30గంటలకు నందిగామ మండల పరిధిలోని చాకలిదాని గుట్ట తండాకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న తర్వాత తండాలోని నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, అనంతరం కొత్తూరులోని మున్సిపల్ కార్యాలయం భవనం, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించనున్నారు. అనంతరం షాద్‌నగర్ పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవం, గిరిజన భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ప్రముఖ నాయకులు హాజరుకానున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

### 'డీటీఎఫ్' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం రూరల్: డీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16, 17వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో జరుగు శిక్షణ తరగతులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కొంగరకలాన్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

### రోడ్డు దాటుతుండగా..

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆదిబట్ల ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట్‌కు చెందిన సాంబరాజు తుర్కయంజాల్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రతి రోజు చెత్త ఏరుకొని జీవనం సాగిస్తుండేవాడు. మంగళవారం రాత్రి బ్రాహ్మణపల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్న బైక్ అతడ్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో సాంబరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# బీసీ కుల గణన చేపట్టండి





మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

- రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్
- చట్టసభల్లో రిజర్వేషన్ అమలు చేయాలి
- జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో డిమాండ్

తాండూరు టౌన్: కేంద్రప్రభుత్వం బీసీల కులగణన చేపట్టకపోవడం శోచనీయమని రాష్ట్ర కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రగతి కోచింగ్ సెంటర్‌లో నియోజకవర్గ బీసీ జేఏసీ మండల, కళాశాల కమిటీల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీ కులాల గణన దశాబ్దాల తరబడిగా ప్రభుత్వాలు చేపట్టడం లేదన్నారు. పశువుల గణన చేపట్టే కేంద్ర ప్రభుత్వం, బీసీల గణన చేపట్టకపోవడం సమంజసం కాదన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం బీహార్ తరహాలో బీసీల కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ముఖ్య వక్త నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ చైర్మన్ విజిఆర్ నారగోని మాట్లాడుతూ బీసీలు అనేక ఏళ్లుగా అణిచివేతకు గురవుతున్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగి శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, లక్ష్మణ్, రాముగౌడ్, నరేష్ గౌడ్, ఇస్మాయిల్, రాజు, సత్యనారాయణ, విజయ్, మహేశ్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే ఆదర్శం తెలంగాణ



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనునలకు శంకుస్థాపన

పెద్దేముల్: దేశంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలంలోని మన్‌సాన్‌పల్లి, కందనెల్లి గ్రామాల్లో బుధవారం మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిలు రోడ్ల నిర్మాణం, బ్రిడ్జి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణం పురుషోత్తంరావు, మండల వైస్ ఎంపీపీ మధులత, మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, పెద్దేముల్ తహసీల్దార్ కిషన్, ఆర్ఐ రాజీరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు మోహన్ రెడ్డి, రవినాయక్, శ్రావణ్‌కుమార్, మధుసూదన్, యాటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోండి

- నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్



ఎంఈఓ హబీబ్ అహ్మద్‌తో మాట్లాడుతున్న రాఘవేందర్ గౌడ్

కుల్కచర్ల: కేజీబీవీలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ హబీబ్ అహ్మద్‌తో ఆయన మాట్లాడారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో 200మంది విద్యార్థులకు ప్రస్తుతం 400మంది చదువుతున్నారన్నారు. ఈ విషయంలో వారికి సరిపడ స్థలం లేక తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని విద్యార్థులు చెప్పారని ఆయన ఎంఈఓ దృష్టికి తెచ్చారు. విద్యార్థినుల సమస్యలను తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని ఆయన కోరారు. లేని యెడల తాము పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అధికారులను రాఘవేందర్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు హన్మంతు, హరికృష్ణ, వెంకట్, ముకుంద, రామకృష్ణ, చిన్నయ్య, రవి, రాము, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల నాయకుడు ఇంద్రారెడ్డి

- ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి
- మంత్రి సబితారెడ్డి



మొయినాబాద్: రెడ్డిపల్లిలో ఇంద్రారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి

మొయినాబాద్: పేద ప్రజలకు అండగా నిలిచి.. ఎంతో మందిని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన దివంగత నేత ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లాలో చెరగని ముద్ర వేసుకున్నారని ఆయన సతీమణి, విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. రెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన ఇంద్రారెడ్డి విగ్రహాన్ని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి బుధవారం ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోర శ్రీనివాస్ ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, మాజీ జెడ్పీటీసీ అనంతరెడ్డి, సీనియర్ నేతలు నర్సింహారెడ్డి, దారెడ్డి కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, సర్పంచ్‌లు వినిత, స్వరూప, నరోత్తంరెడ్డి, కుమార్, ఎంపీటీసీ అంజయ్య, మాజీ సర్పంచ్ సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

**పలువురి నివాళి..**

మొయినాబాద్: మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, మాజీ జెడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు కొత్త నర్సింహారెడ్డి, దారెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. చిలుకూరులో ఇంద్రారెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందారెడ్డి సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ స్వరూప, ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి తదితరులు ఉన్నారు.

**శభాష్ వెంకటేశ్..**

శంకర్‌పల్లి: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే వన్‌గా సాగుతోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో రూ.1.80 కోట్లతో నిర్మించిన ఆడిటోరియం, దాతల సాయంతో మోకిలలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని బుధవారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి ప్రారంభించారు. జనవాడ గ్రామంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గౌడిచర్ల వెంకటేశ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేయించిన ఇంద్రారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గడిచిన ఏడాది కాలంలో ఆడ పిల్లలకు జన్మనిచ్చిన 64 మంది తల్లులకు.. మంత్రి చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.16 వేల చొప్పున వెంకటేశ్ సొంత డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, సర్పంచ్‌లు రవిందర్‌గౌడ్, పొడువు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, సుమిత్రామోహన్‌రెడ్డి, నీలమ్మ, ఎంపీటీసీలు బద్దం సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, రాజునాయక్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

**రైతు సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం**

చేవెళ్ల: మానవీయ కోణంలో ఆలోచిస్తున్న వ్యక్తి సీఎం కేసీఆర్ అని మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్లలో డీసీఎంఎస్ కమర్షియల్ భవనం, గోదాం నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అదే విధంగా మహిళలకు బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లె ప్రగతితో గ్రామాలు స్వచ్ఛతకు నిలయాలుగా మారాయన్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు సమకూర్చామని.. నర్సరీలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతుల కోసం రూ.535.44 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో 2,601 రైతువేదికలు నిర్మించామన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, గోదాం మేనేజర్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగారెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ

- ఎనిమిదిన్నర తులాల బంగారం అపహరణ



చోరీ వివరాలను ఎస్ఐకి చెబుతున్న మాధురి

తాండూరు టౌన్: పాఠశాలకు వెళ్లిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రవూఫ్, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీ చౌక్‌లో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మాధురి రోజు మాదిరిగానే మంగళవారం కూడా ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లింది. కొంత సమయం తరువాత ఆమె భర్త కూడా బయటకు వెళ్లి పోయాడు. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తీసి ఉండడం గమనించింది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి తెరచి ఉన్న బీరువాను చూసింది. అందులో పెట్టిన ఎనిమిదన్నర తులాల బంగారం కనపడలేదు. ఇద్దరు పనిమనుషులతో పాటు, డ్రైవర్ వేర్వేరు సమయాల్లో ఇంటికి పని నిమిత్తం వచ్చి వెళ్తుంటారన్నారు. దీంతో తాళం చెవిని కిటికీలో పెట్టి వెళ్లేవారమన్నారు. బీరువా తాళం కూడా పక్కనే పెట్టానని ఆమె చెప్పింది. బాగా తెలిసిన వారే అపహరించి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. దీంతో ఆమె బుధవారం ఉదయం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# చేతబడి చేస్తాడని దాడి చేశాం

- పోలీసుల విచారణలో వెల్లడి
- ఇద్దరు నిందితుల రిమాండ్

తాండూరు టౌన్: చేత బడి చేస్తాడనే భయంతో ఆర్ఎంపీ వైద్యుడిపై దాడి చేశామని పోలీసుల విచారణలో నిందితులు ఒప్పుకున్నారు. పరారైన ఇద్దరిని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పట్టణ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణంలోని పాత తాండూరుకు చెందిన మొహినొద్దీన్ ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. సదరు వ్యక్తులు కొన్ని రోజుల క్రితం తమవ్యాధి నయం చేయాలంటూ ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు రాగా కొన్ని మందులతో పాటు తాయత్తు కట్టి, నిమ్మకాయ కూడా ఇచ్చారన్నారు. మందులు వేసుకుని, నిమ్మకాయను దిండు కింద పెట్టుకుని నిద్రిస్తే వ్యాధి తగ్గుతుందని వైద్యుడు చెప్పినట్లు నిందితులు పోలీసులతో పేర్కొన్నారు. అయితే వారికున్న వ్యాధి ఎన్ని రోజులైనా తగ్గక పోవడంతో గత నెల 30వ తేదీన వైద్యుడి వద్దకు వచ్చారు. వ్యాధి నయం చేయాలంటే మరిన్ని డబ్బులు ఇవ్వాలని వైద్యుడు డిమాండ్ చేసినట్లు నిందితులు పేర్కొన్నారు. వారు ఇంకా డబ్బులు ఇవ్వలేమని చెప్పడంతో వైద్యం చేయనని ఆర్ఎంపీ నిరాకరించాడు. ఆందోళనకు గురైన వారు సదరు వైద్యుడు తమపై చేత బడి చేస్తాడేమోనని భయపడి ఇద్దరు కలిసి కత్తితో అతని గొంతు కోసి పరారయ్యారు. బుధవారం ఆ ఇద్దరినీ పోలీసులు పట్టుకుని రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ చెప్పాడు. కానిస్టేబుళ్లు హెడ్‌కానిస్టేబుల్ అష్వద్, శివకుమార్, సాయప్ప, షాబీల్‌లను డీఎస్పీ శేఖర్ గౌడ్, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి అభినందించారు.

### వరుస బైక్ చోరీలు..

- ఇద్దరు మైనర్ల అరెస్టు

ఇబ్రహీంపట్నం: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్లను ఇబ్రహీంపట్నం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు గత కొన్నేళ్లుగా మంగల్‌పల్లి, వనస్థలిపురం, హయత్‌నగర్, సైదాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో బైక్ చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరిపై నిఘా పెట్టిన పోలీసులు బుధవారం వారిని అరెస్టు చేసి విచారించగా.. ఇప్పటివరకు 4 బైక్‌లను చోరీ చేసినట్లు వెల్లడించారు. వాహనాలను స్వాధీనం చేసుకొని.. మైనర్ బాలురలను జువెనైల్ హోమ్‌కు తరలించారు. గతంలో హయత్ నగర్, వనస్థలిపురం పీఎస్‌లలో వీరిద్దరిపై కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మంచి నీటి సమస్యపై నిరసన



సల్బత్తాపూర్‌లో రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బంట్వారం: మండల పరిధిలోని సల్బత్తాపూర్ ఎస్సీ కాలనీలో చాలా కాలంగా నీటి సమస్య ఉందని ఆరోపిస్తూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమస్య గురించి సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడడం లేదన్నారు. మిషన్ భగీరథ నీరు వస్తున్నప్పటికీ తాగితే అనారోగ్యానికి గురవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో పైప్‌లైన్ వేయకపోవడంతో గ్రామానికి సరఫరా చేసే బోర్ వాటర్ రావడం లేదన్నారు. దీంతో ప్రతీ రోజు మంచి నీటికి తాము ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయంలో స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మహిళలు హెచ్చరించారు.

# సర్వేకాదు.. హక్కులు కల్పించండి



భూ సర్వేకు వెళ్లిన అధికారులతో కౌలు రైతుల వాగ్వాదం

- ఓంకారేశ్వరాలయ భూముల సర్వేకు వచ్చిన అధికారులపై కౌలు రైతుల ఆగ్రహం
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జోక్యంతో వెనుదిరిగిన అధికారులు

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల సర్వేకు వెళ్లిన అధికారులపై కౌలు రైతులు మండిపడ్డారు. కౌలు రైతులకు సమాచారం లేకుండానే బుధవారం ఆలయ భూముల సర్వేకు వెళ్లిన రెవెన్యూ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులపై కౌలు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నందివనపర్తి ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,400 ఎకరాల భూముల్లో వందేళ్ల క్రితం నుంచి నందివనపర్తి, తాడిపర్తి, కుర్మిద్ద, నస్దిక్‌సింగారం గ్రామాలకు చెందిన 400లకు పైగా కుటుంబాలకు చెందిన కౌలు రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. కౌలు రైతులు ప్రతి యేటా కౌలు చెల్లిస్తూ రాళ్లు, రప్పలు, గుట్టలున్న భూమిని రూ.లక్షలు ఖర్చు చేసి సాగుకు యోగ్యంగా మార్చుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఆలయానికి చెందిన సర్వే నంబరు 11 నుంచి 515 వరకు ఉన్న నంబర్లలోని 1,400 ఎకరాల భూమిని తాజాగా టీఎస్ఐఐసీ సేకరించేందుకు నిర్ణయించింది. విషయం తెలుసుకున్న కౌలు రైతులు ఏళ్లుగా ఆలయ భూముల్లో కౌలు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం.. కౌలు చెల్లిస్తున్నాం.. హక్కులు కల్పించి ఆ భూములపై పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో వందలాది ఎకరాల ఆలయ భూమి కబ్జాకు గురైందని, సర్వే చేసి హద్దులు గుర్తించాలని మాజీ ఆలయ ధర్మకర్త పప్పు కృష్ణమూర్తి దేవాదాయ, ధర్మాదాయ శాఖకు ఫిర్యాదు చేశారు. కౌలు రైతులు రెండేళ్లుగా కౌలు చెల్లించకపోగా ఆ భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తుండడంతో రెవెన్యూ అధికారులు ఇన్నాళ్లు రెవెన్యూ రికార్డుల్లో పహాణిలో నమోదు అవుతున్న కౌలు రైతుల పేర్లను తొలగించారు.

**స్వాధీనం కోసం సర్వే..**

ఓంకారేశ్వరాలయ ఆలయానికి చెందిన భూమిని టీఎస్ఐఐసీకి అప్పగించేందుకు అధికార యంత్రాంగం చూస్తోంది. ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు సర్వే పేరుతో అధికారులు వస్తున్నారు. వారం క్రితం నస్దిక్‌సింగారం గ్రామంలో ఆలయ భూముల సర్వేకు వెళ్లగా తాడిపర్తి సర్పంచ్ దూస రమేశ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల కౌలు రైతులు అడ్డుకున్నారు. అధికారులపై తిరగబడ్డారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. బుధవారం మరోమారు నస్దిక్‌సింగారం గ్రామంలోని ఆలయ భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించేందుకు అధికారులు వచ్చారు. విషయం క్షణాల్లోనే తెలుసుకున్న వందలాది మంది కౌలు రైతులు అధికారులపై తిరగబడ్డారు. మా భూములు ఉన్నాయా, సర్వే కాదు, ముందు ఆ భూములపై హక్కులు కల్పించి, పట్టాదారు, పాసు పుస్తకాలు ఇవ్వండి అంటు మండిపడ్డారు. అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, ప్రతిఘటించడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అధికారులపై దాడికి యత్నించారు. తాడిపర్తి సర్పంచ్ రమేష్ విషయాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేరవేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి సర్వే పేరిట కౌలు రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. దీంతో అధికారులు సర్వేను నిలిపేసి వెళ్లిపోయారు.

# ఆ పథకం ఇక్కడి నుంచేనా!



రావిర్యాల ప్రభుత్వ పాఠశాల

- ఈ నెల 6న తుక్కుగూడకు సీఎం కేసీఆర్ రాక
- రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తారంటూ సమాచారం

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉదయం పూట అల్పాహార పథకాన్ని అందుబాటులోకి తేబోతోంది. ఈ పథకాన్ని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 6న ప్రారంభించనున్నట్లు సమాచారం. దీంతో పాఠశాలలో రెండు రోజుల నుంచి విద్యా, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దడం, భవనాలకు రంగులు వేయడం, పాత భవనాలను కూల్చివేయడం, మౌలిక వసతుల కల్పన వంటివి చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చే రహదారులకు మరమ్మతులు చేస్తున్నారు. రెండు రోజుల నుంచి రావిర్యాలలో అధికారులు, రాజకీయ నాయకుల పర్యటనలతో హడావిడి నెలకొంది. ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ రావిర్యాల గ్రామానికి మొదటిసారి వచ్చే అవకాశం ఉండటంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కూడా జన సమీకరణలో నిమ్మగమయ్యారు.